క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించారు. గ్రామం నలుమూలలా బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ఘనంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గోకవరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని రంపయర్రంపాలెంలో మహిళలకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంపయర్రంపాలెం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. విజేతలకు ఎంప్లాయీస్ సంఘ ప్రధాన కార్యదర్శి పెదరెడ్ల రాజు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దేవలంక బూరయ్య, వెంకట్రావు, వెంకటేశ్వరరావు, సబ్బిశెట్టి శ్రీదేవి, కుమ్మరి లక్ష్మీకాంతం, చిక్కం సతీష్, కొరటి అప్పనబాబు, వేమన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

నిర్లక్ష్యం ఫుల్.. నిర్మాణాలు డల్

- చివరి దశలో నిలిచిపోయిన ప్రభుత్వ భవన నిర్మాణాలు
- సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు సేవా కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో అందని సేవలు
- రూ.కోట్ల ప్రభుత్వ ఆస్తులకు గ్రహణం

తుని రూరల్: గ్రామీణులకు ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టింది. దీనిలో భాగంగా తేటగుంట, టి.వెంకటాపురం, లోవకొత్తూరు, హంసవరం, కేఓ మల్లవరం-1 తదితర గ్రామాల్లో గ్రామ సచివాలయాల నిర్మాణాలను పూర్తి చేసి సేవలను ప్రారంభించారు. టి.వెంకటాపురంలో వెల్‌నెస్ సెంటర్ సైతం ప్రారంభించి వైద్య సేవలు అందిస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్బీకేల నిర్మాణాలు చివరిదశలో ఉన్నాయి. అనూహ్యంగా గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాల్లోనే సేవలు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్బీకేల నిర్మాణాలు నిలిచిపోయాయి.

బిల్లులు చెల్లించకపోవడంతో..

గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిర్మాణాలను విస్మరించడంతో పాటు బిల్లులు చెల్లించలేదు. ఇప్పటికే పెట్టిన పెట్టుబడులు రాక, అప్పులు చేసి మరింత పెట్టుబడులు పెట్టలేక కాంట్రాక్టర్లు నిర్మాణాల జోలికి వెళ్లలేదు. దీంతో ఆయా భవనాల్లో తుప్పలు పెరిగిపోవడం, కొన్ని భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని కాంట్రాక్టర్లు, భవన నిర్మాణాలు పూర్తి చేసి ఎప్పటి నుంచి ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయని గ్రామీణ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్బీకే నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

60 పంచాయతీల్లో 180కిపైగా భవనాలు

తుని నియోజకర్గంలో 60 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జనాభా ప్రతిపాదికన రెండు వేల మందికి ఒక సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకే చొప్పున 180కిపైగా భవనాలు మంజూరయ్యాయి. ఒక్కొక్క సచివాలయం రూ.40 లక్షలు, ఒక్కొక్క వెల్‌నెస్ సెంటర్‌కు రూ.16.50 లక్షలు, ఒక్కొక్క ఆర్బీకేకు రూ.18.50 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. కాలానుగుణంగా నిర్మాణ వ్యయం పెరిగితే సచివాయానికి రూ.4 లక్షల వరకూ అదనపు వ్యయం చెల్లించారు. దీంతో కాంట్రాక్టర్లు శరవేగంగా పనులు చేసినప్పటికీ చివరి దశలో ప్రభుత్వం మారడంతో బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. ఇలా తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు చివరిదశలో నిలిచిపోవడంతో గ్రామీణులకు ప్రభుత్వ సేవలు ఎండమావిలయ్యాయి. ఈ భవనాలు పూర్తయితే ప్రభుత్వానికి రూ.కోట్ల ఆస్తులు సమకూరే అవకాశం ఉంది.



హెచ్.కొత్తూరులో మధ్యంతరంగా నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం



హెచ్.కొత్తూరులో నిలిచిపోయిన సచివాలయ నిర్మాణ పనులు



హంసవరంలో ప్రారంభానికి నోచుకోని రైతు సేవా కేంద్రం

నిర్వీర్యం చేసేందుకే..

గ్రామాల్లో సచివాలయాలు, వెల్‌నెస్ సెంట్లు, ఆర్బీకే భవనాల నిర్మాణాలు పూర్తయితే ప్రభుత్వ సేవలు, వైద్య సేవలు, వ్యవసాయ, అనుబంధ సేవలు ప్రజల ముంగిటకే అందుబాటులోకి వస్తాయి. అలా ప్రజలకు సేవలు అందించడం ఇష్టం లేకపోవడం, ఈ ఘనత గత ప్రభుత్వానికి దక్కుతుందన్న అపోహతో నిర్మాణాలు, బిల్లులు చెల్లింపు నిలిపివేశారు.

– ఎ.సత్యనారాయణ, గ్రామస్తుడు, ఎస్.అన్నవరం

ప్రభుత్వానికి రూ.కోట్ల ఆస్తి

గ్రామీణులకు మెరుగైన సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన సచివాయాలు, వెల్‌నెస్ సెంట్లు, ఆర్బీకేల నిర్మాణదారులకు కొన్ని నెలలుగా బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్లు భవనాలను పూర్తి చేసి అప్పగించలేదు. అప్పగించిన కొన్ని భవనాలు ప్రారంభించలేదు. ఎప్పుడు మోక్షం కలుగుతుందో తెలియని పరిస్థితి. ఈ భవనాల నిర్మాణంతో ప్రభుత్వానికి రూ.కోట్ల ఆస్తి సమకూరుతుంది.

– డివిజన్‌స్థాయి అధికారి, పేరు పెట్టేందుకు నిరాకరించారు

అఖండ దివ్యనామ సంకీర్తన యజ్ఞం ప్రారంభం



వీరవరంలో సత్యసాయిబాబాను పల్లకిలో ఊరేగిస్తున్న నిర్వాహకులు

కిర్లంపూడి: మండలంలోని వీరవరంలో సత్యసాయి వంద గంటల అఖండ దివ్యనామ సంకీర్తన మహాయజ్ఞాన్ని గురువారం ప్రారంభించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు, కన్వీనర్ తోట సర్వారాయుడు, నిర్వాహకులు తోట పాపారావు, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ యజ్ఞం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం నుంచి సోమవారం సాయంత్రం వరకూ నిరాటంకంగా సత్యసాయి నామసంకీర్తన నిర్వహిస్తామన్నారు. సేవా సమితి, భజన మండలి సభ్యులు విధిగా హాజరై సంకీర్తన యజ్ఞాన్ని విజయవంతం చేయాలని కోరారు. తొలుత ప్రశాంతి పతాకాన్ని ఏగరవేసి సత్యసాయిబాబాను పల్లికిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఉషారాణి, డీఎస్‌డీ శ్యామల, తుమ్మలపల్లి జోగేంద్రనాథ్, జయబాబు, కాశీవిశ్వేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

గోశాల ప్రారంభం

తొండంగి: మండలంలోని శృంగవృక్షంలో ఓ రైతుకు మంజూరైన గోశాల (మినీ గోకులం) షెడ్డును గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య ప్రారంభించారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తాళ్లూరు జెడ్పీ హైస్కూల్‌లో కలసిన పూర్వ విద్యార్థులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ, విద్య, వ్యాపార రంగాల్లో స్థిరపడిన వారంతా సుమారు 20 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

సత్యదేవుని సన్నిధిలో సిబ్బంది నిర్లక్ష్యం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం నిత్యకల్యాణం, పచ్చతోరణంతో విరాజిల్లుతోంది. నిత్యం జరిగే స్వామివారి కల్యాణం మాటెలా ఉన్నా మామిడి తోరణాల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఏరోజుకారోజు తోరణం కట్టకపోగా ఎండిపోయిన తోరణం తీసి వేయాలని కూడా అనిపించడం లేదు.

ప్రతిరోజూ తోరణాలు

ఏడాదిలో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు జరిగే వారం రోజులు మినహా మిగిలిన రోజులన్నీ స్వామి, అమ్మవార్ల కల్యాణం జరుగుతుంది. ప్రతిరోజూ సాయంత్రం దేవస్థానంలోని అన్ని ఆలయాలతో పాటు కల్యాణ మండపం, తూర్పు, పశ్చిమ రాజగోపురం ద్వారాలకు మామిడి తోరణాలు కడతారు. అవి కట్టేముందు పాత మామిడి తోరణాలు తొలగిస్తారు. ఇటీవల ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఎప్పుడూ కట్టే చోటనే కాకుండా మరి కొన్నిచోట్ల అదనంగా తోరణాలు కట్టారు. చాలా చోట్ల తోరణాలు ఎండిపోయినా వాటిని తొలగించడం కాని, కొత్తవాటిని కట్టడం కాని చేయలేదు. పశ్చిమ రాజగోపురం లోపల వైపు మెట్లు దిగువన, గోపురానికి ఎదురుగా రూ.1000 వ్రతమండపం మెట్ల వద్ద కట్టిన తోరణాలు ఎండిపోయి రోజులు గడుస్తున్నా వాటిని తొలగించలేదు. కాగా ఇదే మార్గంలో పలువురు వీఐపీలు, హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిలు ఇటీవల స్వామివారి దర్శనానికి వచ్చారు. ఈఓ వీర్ల సుబ్బారావు ప్రతిరోజూ స్వామివారి కార్యక్రమాల్లో పాల్గొంటున్నా వీటిని తొలగించకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పశ్చిమ రాజగోపురం దిగువన, వ్రతమండపం వద్ద ఎండిన తోరణాలు

హై టెన్షన్ వే

- జాతీయ రహదారిపై ప్రమాదకరంగా జంక్షన్‌లు
- తరచూ ప్రమాదాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు



యర్రవరంలో హెచ్చరిక బోర్డులు లేని హైవే జంక్షన్

ఏలేశ్వరం: జాతీయ రహదారులపై నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉన్న జంక్షన్‌లు ప్రమాదాలకు చిరునామాగా మారుతున్నాయి. ఇటీవల తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నిబంధనల అమలులో అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ఇంటి నుంచి బయలుదేరే వారు గమ్యం చేరేలోపే మృత్యుఒడిలోకి చేరుతున్నారు.

నియోజకవర్గంలో...

జాతీయ రహదారిపై ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఏలేశ్వరం మండల పరిధిలోని యర్రవరం, చిన్నింపేట, ప్రత్తిపాడు గ్రామంలోకి వెళ్లేదారి, వచ్చేదారి, రాచపల్లి అడ్డురోడ్డు, శంఖవరం మండలంలోని కత్తిపూడి, అన్నవరంలో జంక్షన్‌లు ఉన్నాయి. వీటి వద్ద హైవే అధికారులు ఎటువంటి జాగ్రత్తలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని ప్రమాదాల్లో కొందరు క్షతగాత్రులవుతుండగా మరొ కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా చిన్నింపేట, కత్తిపూడి గ్రామాల జంక్షన్‌ల వద్ద జరిగే ప్రమాదాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

అధికారులు విఫలం

హైవేపై జంక్షన్‌ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా వాటిని నివారించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల కాలంలో కత్తిపూడి జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువయ్యాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నారు.

నిబంధనలు పాటించాలి

జాతీయ రహదారిపై నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో పాటు వాహనదారుల్లో అవగాహన కల్పించేలా జాతీయరహదారిపై అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



చిన్నింపేటలో ప్రమాదాలు జరుగుతున్న హైవే జంక్షన్

వైభవంగా త్రిమూర్తుల తీర్థం

తుని రూరల్: మండలంలోని చేపూరులో త్రిమూర్తులుస్వామి తీర్థం గురువారం వైభవంగా జరిగింది. ఏటా ముక్కనుమ రోజు స్వామవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా తుని, ఎర్రకోనేరు, వి.కొత్తూరు, జగన్నాథగిరి, ఎస్.అన్నవరం, ఎస్.చామవరం తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు త్రిమూర్తులుస్వామిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. 16వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకుని తీర్థం జరగడంతో ప్రమాదాలు జరగకుండ రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే రాజుపేటలో గ్రామ దేవతల తీర్థం నిర్వహించారు. మర్లపాడు, కొత్త వెలంపేట తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



చేపూరు త్రిమూర్తులుస్వామి తీర్థంలో భక్తుల కోలాహలం

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



భీమవరపుకోట సిండికేట్ బ్యాంకులో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై టి. రామకృష్ణ సూచించారు. మండలంలోని భీమవరపుకోట సిండికేట్ బ్యాంకులో వినియోగదారులకు గురువారం సైబర్ నేరాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ల వినియోగం గణనీయంగా పెరగడంతో ఇటీవల సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారన్నారు. డిజిటల్ అరెస్టులు అంటూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. పోలీసు చట్టంలో డిజిటల్ అరెస్టు ప్రస్తావనే లేదన్నారు. మనకు సంబంధం లేని యాప్‌లు, ఫోన్లకు వస్తున్న ఓటీపీల జోలికి వెళ్లకూడదన్నారు. అనేక కోణాల్లో ఎర వేసి ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్న సైబర్ నేరగాళ్ల ఆగడాల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో...

గండేపల్లి: మండలంలోని బొర్రంపాలెంలో ప్రజలకు గురువారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వైఆర్కే శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల సంరక్షణ, భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ఇళ్లలో చోరీల నివారణపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోకల సుబ్బు, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి వెంకటలక్ష్మి బాబ్జి, ఎస్సై యువి శివనాగబాబు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



బొర్రంపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

అదనపు కోర్టుల ఏర్పాటు కలేనా ?

- ప్రత్తిపాడు కోర్టులో రోజురోజుకూ పెరుగుతున్న పెండింగ్ కేసులు
- జిల్లా స్థాయిలో అత్యధిక కేసులు ఇక్కడే నమోదు
- అదనపు మెజిస్ట్రేట్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఏర్పాటు చేయాలని కోరుతున్న న్యాయవాదులు



ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ మరో రెండు కోర్టులు ఏర్పాటు చేయాలన్న న్యాయవాదుల డిమాండ్ పరిష్కారానికి నోచుకోలేదు. ఈ కోర్టులో సుమారు 3,500 కేసులు పెండింగ్ ఉన్నందున అదనపు మెజిస్ట్రేట్ కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రత్తిపాడు కోర్టు సముదాయంలో ప్రస్తుతం ఉన్న స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టుకు గానీ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు గానీ గత రెండు సంవత్సరాలుగా న్యాయమూర్తులు లేక ఆ కేసుల పరిష్కారమూ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు (జూనియర్ సివిల్ జడ్జి కోర్టు) న్యాయమూర్తే పరిష్కరించాల్సి వస్తోంది. దీని వల్ల ఆకోర్టుకి పని భారం పెరిగి కేసులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి కక్షిదారులు అంటున్నారు.

40 ఏళ్ల పాటు అద్దె భవనంలో...

ప్రత్తిపాడులో 1982 సెప్టెంబర్ 4న మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేశారు. దీనిని హైకోర్టు న్యాయమూర్తి వి.మాధవరావు ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ కోర్టు 2022 వరకు అద్దె భవనంలో కొనసాగింది. పంచాయతీ స్థలం కేటాయించడంతో సుమారు రూ.6 కోట్ల నిధులతో ఈ కోర్టుకు పక్కా భవనం నిర్మించారు. 2022 మార్చి 28న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ యు.దుర్గాప్రసాద రావు, జస్టిస్ రావు రఘునందరావు వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రస్తుతం జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులు ఈ భవనంలో నడుస్తున్నాయి.

అత్యధిక కేసులు ప్రత్తిపాడులోనే..

జిల్లా స్థాయిలోనే అత్యధిక కేసులు ప్రత్తిపాడు కోర్టులో దాఖలవుతున్నాయి. ఈ కోర్టు పరిధిలో ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి, అన్నవరం పోలీస్ స్టేషన్లున్నాయి. ఇంతకు ముందు రౌతులపూడి మండలంలోని కొన్ని గ్రామాలు ఈ కోర్టు పరిధిలో ఉండేవి. ఏడాది క్రితం రౌతులపూడి మండలాన్ని పూర్తిగా తుని కోర్టు పరిధిలో చేర్చారు. ఈ స్టేషన్ల పరిధిలో నమోదయ్యే క్రిమినల్ కేసులన్నీ ఈ కోర్టులోనే విచారణ జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు ఎంతైనా అవసరమని న్యాయవాదులు అంటున్నారు. కోర్టులో ప్రస్తుతం సుమారు 3,500 సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకే జడ్జి 3,500 కేసులు పరిష్కరించాల్సి ఉంది. కేసుల సత్వర పరిష్కారం కోసం తక్షణమే ఈ కోర్టు సముదాయంలో ఒక అడిషనల్ కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అవసరం ఉందని న్యాయవాదులు హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లారు.

పదేళ్ల క్రితమే స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు

ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టును పదేళ్ల క్రితమే క్రితమే ఏర్పాటు చేశారు. కాని ఈ స్పెషల్ కోర్టుకు పూర్తి స్థాయి న్యాయమూర్తుల నియామకం జరగనే లేదు. ఈ కోర్టు పరిధిలోని కేసులను కూడా జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తే పరిష్కరించాల్సి వస్తోంది. ఈస్పెషల్ కోర్టుకు న్యాయమూర్తిని నియమించాలని బార్ అసోసియేషన్ సభ్యులు అనేక పర్యాయాలు రాష్ట్ర హైకోర్టును కోరారు.

జ్యుడీషియల్ కోర్టులో పలు కేసుల విచారణ

ప్రస్తుతం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో సివిల్, క్రిమినల్, మోటారు వాహన ప్రమాద కేసులు విచారణ జరుగుతాయి. దీంతో పాటు న్యాయమూర్తి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యక్రమాలను చైర్మన్ హోదాలో పర్యవేక్షించాల్సి ఉంది. న్యాయ అవగాహన సదస్సులు, వసతి గృహాల, ఆసుపత్రులు, సబ్ జైలు పర్యవేక్షణ చేయాల్సి వస్తోంది. అంతేగాక కోర్టులో కిర్లంపూడి మండలం బూరుగుపూడి నుంచి శంఖవరం మండలం మండపం వరకు గల జాతీయ రహదారిపై జరిగిన ప్రమాద కేసులు, సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులను పరిష్కరిస్తున్నారు. ప్రస్తుతం అన్ని రకాల కేసులు అధిక సంఖ్యలో దాఖలవుతున్నాయి. కక్షిదారులకు సత్వర న్యాయం అందాలంటే కేసుల సంఖ్యను తగ్గించడానికి అదనపు మెజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు అవసరం



గతంతో పోలిస్తే ప్రసుతం కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. న్యాయవాదులు ఈ వృత్తిని ఎంపిక చేసుకోవడానికి ఇదో కారణం. న్యాయవాదుల సంఖ్య కూడా పెరిగింది. కక్షిదారులకు సత్వర న్యాయం జరగాలంటే ప్రస్తుతం ఉన్న కోర్టులతో పాటు అదనపు మెజిస్ట్రేట్ కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి. స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులకు న్యాయమూర్తులను వెంటనే నియమించాలి.

– బుగత శివ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఐలాజ్